
పవర్‌పేట గంగానమ్మ జాతరకు శ్రీకారం



ముడుపును శిరస్సుపై ధరించి వస్తున్న ఎమ్మెల్యే చంటి



పవర్‌పేట గంగానమ్మ

- ముడుపు కట్టి జాతర ప్రారంభించిన ఎమ్మెల్యే చంటి..

ఏలూరు రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పవర్‌పేటలో కొలువై ఉన్న గంగానమ్మ, ఆదిలక్ష్మమ్మ, వినుకొండ అంకమ్మ, పోతురాజు బాబుల జాతర మహోత్సవానికి ఆదివారం వేప చెట్టుకు ముడుపు కట్టి అంకురార్పణ చేశారు. ముడుపు కట్టే కార్యక్రమంలో ఎమ్మెల్యే, జాతర కొలువుల కమిటీ గౌరవాధ్యక్షుడు బడేటి చంటి, మీనా దంపతులు, నగర మేయర్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు పెద బాబు దంపతులు, ఆర్టీసీ విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్, జాతర కొలువుల కమిటీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, జ్యోతి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తొలుత పవర్‌పేటలోని విజయ గణపతి ఆలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే అక్కడ నుంచి ముడుపును శిరస్సుపై ధరించి గానుగలపేటలోని గంగానమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయంలో కొలువు దీరిన అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. పందిరిరాట స్థాపన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు తనహయాంలో అంకురార్పణ జరగడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. సంప్రదాయాలను నిలబెట్టే రీతిలో ఏలూరులోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరి జాతర పూజలందుకుంటున్న అమ్మవార్లు భక్తులపై కరుణాకటాక్షాలు కురిపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి సతీమణి రేణుక, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట రామయ్య, మోటేపల్లి చంద్రశేఖర్, కోటేశ్వరమ్మ దంపతులు, జనసేన నాయకులు నారా శేషు, ఘంటసాల వెంకటలక్ష్మీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపనా చౌదరి, ఆర్ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పాలడుగు వెంకట రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సండే సందడి

సందర్శకులతో కళకళలాడిన కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌లు

సందర్శకులతో కిటకిటలాడుతున్న పేరుపాలెం బీచ్



మొగల్తూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు, నరసాపురం మండలాల్లోని బీచ్‌లు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. కార్తీకమాసం.. అందునా ఆదివారం కావడంతో వన సమారాధనలకు కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లకు ఏటా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివస్తారు. ఈ ఏడాది కార్తీకమాసం ప్రారంభమైనా మొంథా తుఫాన్, భారీ వర్షాలు కారణంగా బీచ్ వద్దకు సందర్శకులను అనుమతించలేదు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో తొలిసారిగా ఈ ఆదివారం పర్యాటకులను అనుమతించడంతో సందర్శకులతో బీచ్ కళకళలాడింది. ఉవ్వెత్తున్న ఎగసి పడుతున్న అలల నడుమ కేరింతలు కొడుతూ సముద్ర స్నానం చేసి సేద తీరారు. తీరం వెంబడి ఉన్న ఆలయాలను సందర్శించారు. డీఎస్పీ డాక్టర్ శ్రీవేద ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, వంద మంది పోలీస్ సిబ్బంది, మెరైన్ పోలీసులు బందోబస్త్‌లో పాల్గొన్నారు. వీరితో పాటు సముద్ర స్నానం చేస్తూ సందర్శకులు లోపలకంటూ వెళ్లకుండా 20 మంది గజ ఈతగాళ్లను నియమించారు. ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ రెవెన్యూ సిబ్బంది బీచ్‌ను సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



బీచ్‌లో బందోబస్త్‌ను పర్యవేక్షిస్తున్న పోలీస్ సిబ్బంది

కార్తీక వనసమారాధనల జోష్.. ఆటపాటలతో హుషారు -8లో..

నేటి పీజీఆర్ఎస్‌కు కలెక్టర్, జేసీ అందుబాటులో ఉండరు

ఏలూరు,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ నష్టాల పరిశీలనకు కేంద్ర బృందం సోమవారం పర్యటించనున్న దృష్ట్యా కలెక్టరేట్‌లో జరిగే ప్రజా పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ అభిషేక్‌గౌడలు అందుబాటులో ఉండరని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.పీజీఆర్ఎస్ యథావిధిగా జరుగుతుందని ఇతర అధికారులు,తాను ఫిర్యాదులు స్వీకరిస్తామని ఆయన వివరించారు.

కొండెక్కిన కూరగాయలు

- సామాన్యులకు అందుబాటులో లేని ధరలు

అట్టడుగు వర్గాలకు ఉచిత న్యాయసేవలందాలి

- ఏలూరులో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం

లోపలి పేజీలో..

నేడు కేంద్ర బృందం రాక

- మొంథా తుఫాన్ పంట నష్టాలపై పరిశీలన
- ఉంగుటూరు మండలంలో పర్యటన
- జిల్లాలో 5704.24 హెక్టార్లలో పంట నష్టం అంచనా

ఏలూరుసిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):జిల్లాలో మొంథా తుఫాన్ తీవ్రంగా పంట నష్టాలను మిగిల్చింది. నష్టపోయిన పంట పొలాలను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన పరిశీలన బృందం ఈనెల 10వ తేదీ సోమవారం జిల్లాలో పర్యటించనుంది. ఈ మేరకు పర్యటన షెడ్యూల్ ఖరారైంది. బృందంలో కేంద్ర వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ శాఖ, డైరెక్టరేట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ , హైదరాబాద్‌కు చెందిన డా.కె.పొన్నుస్వామి, సెంట్రల్ వాటర్ కమిషన్ హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసు బైరి, కేంద్ర విద్యుత్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తిసింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ అండర్ సెక్రటరీ మనోజ్‌కుమార్ మీనా సభ్యులుగా ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు గన్నవరం నుంచి బయలుదేరి నాలుగు గంటలకు ఉంగుటూరు మండలానికి ఈ బృందం చేరుకుంటుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉంగుటూరులో తుఫాన్ నష్టాలు, జిల్లా యంత్రాంగం చేపట్టిన పునరుద్ధరణ చర్యలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. ఉంగుటూరు మండలంలో క్షేత్రస్థాయిలో పర్యటించి తుఫాన్ నష్టాలను పరిశీస్తుంది. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురానికి బృందం బయలుదేరి వెళ్తుంది.



ఉంగుటూరు మండలంలో నేలనంటిన వరిపంట (ఫైల్)

5704.24 హెక్టార్లలో పంటనష్టం

మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో 5704.24 హెక్టార్లలో వరితో పాటు ఇతర పంటలు నష్టపోయినట్టు జిల్లా వ్యవసాయ శాఖ పంట నష్టాల సర్వే అనంతరం ప్రభుత్వానికి నివేదిక పంపింది. ఇందులో వరి పంట 4807.37 హెక్టార్లలో నష్టపోగా మినుము 859.21 హెక్టార్లు, పత్తి 33.11 హెక్టార్లు, పెసలు 2.23 హెక్టార్లు, అలసంద 0.70 హెక్టార్లు, వేరుశనగ 1.62 హెక్టార్లలో నష్టపోయినట్టు నివేదికలో పేర్కొన్నారు. జిల్లాలో 25 మండలాల్లో పంట నష్టాలు జరగగా, 11,613 మంది రైతులు పంట నష్టపోయారు. ముదినేపల్లి మండలం 831.96 హెక్టార్లు, పోలవరం 725.80 హెక్టార్లు, దెందులూరు 634.40 హెక్టార్లు, ఉంగుటూరు 443.37 హెక్టార్లు, మండవల్లి 400.99 హెక్టార్లు, పెదపాడు 337.44 హెక్టార్లు, భీమడోలు 279.68 హెక్టార్లు, పెదవేగి 264.71 హెక్టార్లు, ఆగిరిపల్లి 260.57 హెక్టార్లు, కొయ్యలగూడెం 238.17 హెక్టార్లు, నూజివీడు 234.01 హెక్టార్లు, జంగారెడ్డిగూడెం 229.18 హెక్టార్లు, నిడమర్రు 229.09 హెక్టార్లు, వేలేరుపాడు 95.69 హెక్టార్లు, చింతలపూడి 84.62 హెక్టార్లు, ద్వారకాతిరుమల 73.36 హెక్టార్లు, ముసునూరు 71.50 హెక్టార్లలో వరితోపాటు ఇతర పంటలు నష్టపోగా మిగిలిన మండలాల్లో 50 హెక్టార్ల కంటే తక్కువగానే పంట నష్టం వాటిల్లింది. పంట నష్టాల ప్రాతిపదికగా రైతులకు పంట నష్టపరిహారం చెల్లించే అవకాశాలున్నాయి. తాజాగా కేంద్ర బృందం జిల్లాలో పర్యటిస్తుండడంతో రైతులు తమ గోడు విన్పించేందుకు సన్నద్ధమవు తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం

- 12న ఓటర్ల మ్యాపింగ్, శిక్షణ తరగతుల నిర్వహణపై రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి వీడియో కాన్ఫరెన్స్

ఏలూరుసిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తుగా సమాయత్తం అవుతున్నారు. ఈనెల 11వ తేదీ నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఓటర్ల మ్యాపింగ్, శిక్షణ కార్యక్రమాలకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు సంబంధించి ఈ వీడియో కాన్ఫరెన్స్ ఈనెల 12న నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.

రేపు రెండు ప్రాసెసింగ్ యూనిట్లకు సీఎం శ్రీకారం

ఏలూరు,నవంబరు 9(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని రెండు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లకు శంకుస్థాపన, ఒక ఎంఎస్ఎంఈ పార్కును వర్చువల్‌గా ఈనెల 11న సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఆరోజు కనిగిరిలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనే సీఎం అక్కడ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 60 పారిశ్రామిక ప్రాజెక్టులు, 51 ఎంఎస్ఎంఈలు ప్రారంభిస్తారన్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో రూ.208 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్‌ను, నూజివీడు మండలంలో రూ.110 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్నా రమణసింగ్ గ్లోబల్ ఫుడ్ పార్కులకు సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని వివరించారు. చింతలపూడి నియోజకవర్గంలో 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కును సీఎం ప్రారంభిస్తారన్నారు.గోద్రెజ్ ఆగ్రోవెట్ యూనిట్ ద్వారా 366 మందికి, రమణసింగ్ గ్లోబల్ ఫుడ్ పార్కుతో 1500 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు.

ఆర్టీసీలో పదోన్నతులకు రైట్‌రైట్

- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 326 మందికి ఛాన్స్
- నేడు విజయవాడలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు కౌన్సెలింగ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)



ఆరేళ్ల నుంచి పదోన్నతుల కోసం ఎదురు చూసిన ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికన 326 మంది ఉద్యోగుల పదోన్నతులకు పశ్చిమ డీపీటీవో వరప్రసాద్ కసరత్తు పూర్తిచేశారు. నరసాపురం, జంగారెడ్డిగూడెం, ఏలూరు, నూజివీడు, తాడేపల్లిగూడెం, తణుకు డిపోల పరిధిల్లో ఉద్యోగులకు మేలు జరగనుంది. ఈ పదోన్నతులతో ఖాళీలను భర్తీ చేస్తారు. ఇటీవలే కూటమి ప్రభుత్వం ఆర్టీసీలో కిందస్థాయి ఉద్యోగులకు పదోన్నతిని కల్పించేందుకు జీవో నెంబర్ 40ను విడుదల చేసింది.

వైసీపీ సర్కార్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినా ఉద్యోగుల బాగోగులను పట్టించుకోలేదు. సర్వీసు రూల్స్ నుంచి పదోన్నతుల వరకు ఉద్యోగులకు కష్టదాట్లతోనే కాలం గడిపేసింది. ప్రజా రవాణా ఉద్యోగుల బాధలను, ఆవేదనలను అర్థం చేసుకున్న కూటమి ప్రభుత్వం పలు కేడర్లలో ఉద్యోగుల పదోన్నతులకు మార్గం సుగమం చేసింది. కొన్ని జిల్లాలో పదోన్నతులపై కోర్టులను ఆశ్రయించడంతో ఉమ్మడి జిల్లాలో ఏ విధంగా చేపట్టాలన్న దానిపై సోమవారం నాటికి తుది రూపు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.ఉద్యోగుల రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ల ప్రాతిపదిక డీపీటీవో అర్హుల జాబితాను సిద్ధం చేశారు. 10వ తేదీ సోమవారం ఉదయం పది గంటలకు విజయవాడ ఆర్టీసీ ఈడీ కార్యాలయంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్-2కు కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు కల్పిస్తారు. తర్వాత విజయవాడ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మిగిలిన కేడర్లలో పదోన్నతులు జరుగుతాయి. జిల్లాలో ఖాళీగా ఉన్న డీసీటీఐ 22 మంది, ఏడీసీలు 87, ఎనిమిది మంది లీడింగ్ హ్యాండ్ (ఎల్‌హెచ్), టెక్నికల్ ఏడీసీలు 6, గ్రేడ్-1 డ్రైవర్లు 81, గ్రేడ్-1 కండక్టర్లు 91 మంది, మెకానిక్ గ్రేడ్-1 15 మంది, టైర్ మెకానిక్ గ్రేడ్ వన్ -4, గ్యారేజీల్లో పనిచేసే ఆర్టిజన్స్ గ్రేడ్-1, ఆర్టిజన్స్ గ్రేడ్ -2 ముగ్గురు, డిప్యూటీ మెకానిక్‌లు ఆరుగురికి పదోన్నతులకు అవకాశం ఉంది.


తీరనున్న దాహార్తి

- ఎర్రకాలువ జలాశయం నుంచి జంగారెడ్డిగూడెం పట్టణ ప్రజలకు శుద్ధి చేసిన మంచినీరు
- రూ.101 కోట్లతో ఏఐఐబీ మంచినీటి పథకానికి మార్గం సుగమం
- టెండరు దశలో పథకం.. పూర్తవ్వగానే పనులు ప్రారంభం

జంగారెడ్డిగూడెం నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణానికి ఎర్రకాలువ జలాశయం నుంచి శుద్ధి చేసిన మంచినీటిని ఇంటింటికీ కుళాయిల ద్వారా అందించడానికి మార్గం సుగమం అయ్యింది.రూ.101.16 కోట్లతో చేయబోయే ఈ భారీ మంచినీటి పథకం ప్రస్తుతం టెండరు దశలో ఉంది. ఇది పూర్తయితే పట్టణంలో మంచినీటి వెతలకు చెక్ పడనుంది.

2018లో అంకురార్పణ

పట్టణంలో పెరుగుతున్న జనాభా ప్రకారం మున్సిపాలిటీ తరపున ప్రజలకు మంచినీటిని పూర్తి స్థాయిలో సరఫరా చేయలేక పోతున్నారు. ఈ తరుణంలో పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీటిని అందించడానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) ద్వారా రూ.80.95 కోట్లు మంజూరు చేసింది. తాజాగా రీ ఎస్టిమేట్ వేసి అధికారులు పంపించగా రూ.85.38 కోట్లు మంజూరు చేశారు. దీనికి జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ నుంచి ఏడేళ్ల వరకు ప్రాజెక్టు నిర్వహణ ఖర్చు రూ.15.78 కోట్ల నిధులు కలిపి మొత్తం రూ.101.16 కోట్లతో ఈ మంచినీటి పథకం నిర్మాణం కానుంది.ముందుగా ఎర్ర కాలువ జలాశయం వద్ద సుమారు రూ.60 కోట్లతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఆ ప్లాంట్ ద్వారా జలాశయం నీటి ని శుద్ధి చేసి జంగారెడ్డిగూడెం వరకు పైప్‌లైన్ వేసి పట్టణంలోని ప్రతీ ఇంటికీ శుద్ధి చేసిన మంచి నీరు ఇవ్వాలనేదే ఈ పథకం ముఖ్య లక్ష్యం. ఇప్పటికే దాదాపు ఐదు కిలోమీటర్ల మేర పట్టణంలో పైప్‌లైన్ వేశారు.ఎర్రకాలువ జలాశయం నుంచి పైప్‌లైన్ల ద్వారా పట్టణంలో ఎంపిక చేసిన సాయి బాలాజీ టౌన్‌షిప్, మున్సిపల్ కార్యాలయం, బాలాజీ నగర్, ఉప్పలమెట్ట, డాంగే నగర్ వద్ద (మిగతా 8వ పేజీలో)



ఎర్రకాలువ జలాశయం



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రెడ్డిదొర

హైస్కూల్ ప్లస్‌లలో బోధనా సిబ్బందిని నియమించాలి : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎంపిక చేసిన జడ్పీ హైస్కూళ్లలో ఇంటర్మీడియట్ విద్యాబోధనకు ఏర్పాటు చేసిన జడ్పీ హైస్కూల్ ప్లస్‌లలో ఖాళీగావున్న పీజీటీ పోస్టులను ప్రభుత్వం భర్తీచేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆదివారం ఏలూరులో జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా సబ్ కమిటీ సమావేశంలో సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర మాట్లాడుతూ విపత్తు సెలవుల భర్తీపేరుతో రెండో శనివారం సెలవులను ఎత్తేయడం శోచనీయమన్నారు. జూలై 2023 నుంచి 12వ పీఆర్సీ జీతభత్యాలు అమలు కావాల్సి ఉండగా, ఇంతవరకు కనీసం పీఆర్సీ కమిషనర్‌ను నియమించకపోవడం సరైంది కాదన్నారు. కొత్త పీఆర్సీ సిఫారసులు అందేలోగా 30 శాతం ఇంటీరియం రిలీఫ్‌ను ప్రకటించాలని, పెండింగ్‌లో వున్న మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు నరసింహ రాజు, శాస్త్రి, దొరబాబు, నారాయణ, రమాదేవి, గణేష్, రంగావలి, నాగేశ్వరరావు, కొండయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరి కోతలకు వెళ్లి విద్యుత్ షాక్

ఇద్దరు దుర్మరణం





ఘటనా స్థలం.. సందీప్, సింహాద్రి (ఫైల్)

ఇరగవరం/గండేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):వరి కోతలకు వెళుతుండగా విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఇరగవరం మండలం పేకేరుకు చెందిన కరిపెట్టి సింహాద్రి అప్పన్న(53) వరి కోత యంత్రాలతో ఆయా ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగిస్తు న్నాడు. అతని వద్ద కోత మిషన్ డ్రైవర్‌గా రాపాకకు చెందిన గెద్దం సందీప్(20) పని చేస్తున్నాడు. కాకినాడ జిల్లా పరిసర ప్రాంతాల్లో వరి కోతలు కోసేందుకు ఐషర్ వ్యాన్‌పై కోత యంత్రం వేసుకుని బయలుదేరారు. ఆదివారం గండేపల్లి మండలం రామయ్యమ్మపాలెం వద్ద మిషన్‌కు 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి డ్రైవర్ సందీప్ షాక్‌తో మృతి చెందాడు. ముందు బండిపై వెళుతున్న అప్పన్న వెనక్కి వచ్చి ఏమ యిందోనని వ్యాన్‌ను ముట్టుకోగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతదేహాలను అంబులెన్స్‌లో మార్చురీకి తరలించారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శివనా గబాబు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు.

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

సందీప్ తండ్రి లాజరు వ్యవసాయం చేస్తుంటాడు. తల్లి ప్రేమలత ఉపాధి నిమిత్తం ఇతర దేశాలకు వెళ్లారు. సందీప్ పెద్ద అక్కకు వివాహం కాగా, రెండో అక్క డిగ్రీ చదువుతోంది. సందీప్ పదో తరగతి వరకు చదువుకుని డ్రైవర్‌గా చేరారు. సోదరుడి మృతితో అక్కలు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. అప్పన్నకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు వీరాస్వామి, వెంకటరమణ ఉన్నారు. పెద్ద కుమారుడు ఇటీవల అమెరి కాకు వెళ్లేందుకు సిద్ధపడుతుండగా చిన్న కుమారుడు వెంకటరమణ బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం వీరి మరణ వార్త వినగానే రాపాక, పేకేరు గ్రామాల్లో బంధువులు, కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయాయి.



విషాదంలో కుటుంబ సభ్యులు



శ్రీవారి ఆలయం ప్రాంగణంలో భక్తుల రద్దీ

కిటకిటలాడిన గోవిందుని సన్నిధి

ద్వారకాతిరుమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం అందులోనూ అందరికీ సెలవురోజు కావడంతో ఉదయం నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. 15 వేలమందికి పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి 2గంటల పైబడి సమయం పట్టింది. సాయంత్రం నుంచి రద్దీ కాస్తతగ్గుముఖం పట్టింది. ఆలయంలోని వృక్షాల వద్ద పలువురు యాత్రికులు కార్తీక దీపాలు వెలిగించారు. శ్రీవారి నిత్యార్జిత కల్యాణంలో దాదాపు 123 జంటలు పాల్గొన్నారు.

వైభవంగా సువర్చల హనుమద్ కల్యాణం



జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 9:గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆదివారం ఉదయం హనుమద్ హోమం నిర్వహించిన అనంతరం సువర్చల హను మద్ కళ్యాణం ఆలయ అర్చకులు, వేద పండితులు, ఋత్వికుల ఆధ్వ ర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ సేవల రూపంలో రూ.2,68,740 ఆదాయం లభించినట్లు 4200 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించినట్లు ఈవో చందన తెలిపారు.

నేత్రపర్వంగా శివకల్యాణం



ద్వారకాతిరుమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర పాలకునిగా విరాజిల్లుతోన్న శివ దేవుని ఆలయంలో స్వామివారి కల్యాణం ఆదివారం నేత్ర పర్వంగా జరిగింది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయ ముఖమండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా,పార్వతీ సమేత శివయ్య కల్యాణ మూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీల కర్ర బెల్లం ధరింపచేసి మాంగల్య ధారణ, తలంబ్రాలు మేళతాళాలు, డోలు ,సన్నాయి వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు.

గుబ్బల మంగమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



బుట్టాయగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలో వేంచేసిన వనదేవత గుబ్బల మంగ మ్మతల్లిని దర్శించుకోడానికి భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి దర్శనాలకు వచ్చిన భక్తులతో అమ్మ వారి ఆలయ ప్రాంగణం కిటకిలాడింది. దర్శనాలు అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

క్షీరారామునికి ప్రత్యేక పూజలు



పాలకొల్లు టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామివారి ఆలయానికి ఆదివారం పంచారామ యాత్రల పేరుతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సుమారు 18 వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాల సమాచారం.



దెబ్బతిన్న ప్రహరీ గోడ : స్వామివారి ఆలయం పడమర వైపు ఉన్న ఆలయ బేడా మండపం గోడ వెనుక వైపు 20 అడుగుల మేర ప్రహరీ దెబ్బతింది. ఈ గోడ అడుసు, మట్టి ఇటుకలతో నిర్మించారని, ఇటీవల కురిసిన వర్షాలకు గోడ దెబ్బతిని ఉంటుందని ఛైర్మన్ మీసాల రాము తెలిపారు. ముందు జాగ్రత్తగా బేడ మండపం వైపు భక్తులు ప్రదక్షణలు చేయకుండా నిలిపి వేసినట్లు వివరించారు.

జంగారెడ్డిగూడెంలో గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ



జంగారెడ్డిగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం ప్రపంచ వ్యాప్తంగా అభిమానుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న గాయ కుడని ఆయన తనయుడు ఎస్పీ చరణ్ అన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం జడ్పీ బాలుర హైస్కూల్ సమీపంలో ఎస్పీ బాలు అభిమాని కుందా శాస్త్రి మాస్టారు ఆర్థిక సహకారంతో నిర్మించిన బాలసుబ్ర హ్మణ్యం విగ్రహాన్ని ఎస్పీ చరణ్ ఆవిష్కరించారు.సినీ నిర్మాత కరాటం రాంబాబు మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 27 సంవత్సరాల క్రితం దేవుళ్లు సినిమాలో ఎస్పీ బాలు మూడు పాటలు పాడారని ఆ పాటలు ఇప్పటికీ ఎవర్‌గ్రీన్‌గా ఉన్నాయన్నారు. నిర్వాహకులు, పలువురు నాయకులు ఎస్పీ చరణ్‌ను ఘనంగా సత్కరించారు. నిర్వాహకుడు కుందా శాస్త్రి, శిల్పి ఉడయార్‌లను సత్కరించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, పాల్గొన్నారు.

ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారాలకు ఉమ్మడి జిల్లాలో ఆరుగురి ఎంపిక

ఏలూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న మౌలానా అబుల్‌కలాం అజాద్ 138వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అంద జేసే ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డులకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆరుగురుని ఎంపిక చేశారు. ఎంపికైన ఉత్తమ టీచర్ల జాబితాను మైనార్టీస్ సంక్షేమశాఖ విడుదల చేసింది. ఏలూరు జిల్లానుంచి ఏలూరులోని మౌలానా అబుల్‌కలాం అజాద్ (మాకా)ఉర్దూ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న షేక్ షకీలా బేగం ఎంపికయ్యారు. జంగారెడ్డిగూడెంలో ఎస్జీటీగా 2023-24 విద్యా సంవత్సరంలో పనిచేస్తున్న సమయంలో ఏడేళ్లుగా మూతపడిన ఓ ఉర్దూ స్కూలును పునః ప్రారంభింపజేయించడంతో పాటు, అదే పాఠశాలకు డిప్యూటేషన్ వేయించుకుని ఏకంగా 40 మంది బాలబాలికలను స్కూలులో చేర్పించడంలో విజయం సాధించడంతో ప్రశంసలందుకున్నారు. ఈమెతో పాటు జిల్లానుంచి అవార్డులు పొందిన వారిలో ఉంగుటూరు మండలం చేబ్రోలు ఉర్దూ ప్రాథ మికోన్నత పాఠశాలలో ఎస్జీటీలుగా పనిచేస్తున్న తస్లీం సుల్తానా, ఎండి సనావుల్లా షరీఫ్, కైకలూరు మండలం కొత్తపేట ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న హసీనా సుల్తానా, ఏలూరురూరల్ మండలం శనివారపుపేట ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఎస్కే .అన్వర్ జహాన్‌లకు రాష్ట్ర ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. పశ్చిమగోదావరి జిల్లానుంచి తాడేపల్లిగూడెం సంజీవరెడ్డినగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఎండి.సిరాజ్ ఎంపికయ్యారు. వీరందరికీ అవార్డులను ఈ నెల 11న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు అందించనున్నారు.

కొండెక్కిన కూరగాయలు



తాడేపల్లిగూడెం, ఏలూరు టూటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొనలేం.. తినలేం.. అన్నట్లుగా కూరగాయల ధరలు రోజురోజుకి పెరుగుతున్నాయి. సామాన్యులకు ధరలు అందుబాటులో లేక విలవిల్లాడుతున్నారు. 15 రోజులుగా ఇదే పరిస్థితి. కూరగాయలు ధరలు దిగిరావడం లేదు. వారం వారానికి పెరుగుతూనే పోతున్నాయి. గత వారంతో పోల్చుకుంటే ఒక టమాటా తప్ప మిగిలిన కూరగాయల ధరలు పెరిగాయి. వాతావరణంలో వచ్చిన మార్పుతో దిగుబడి తగ్గింది. మొంథా తుఫాన్ ప్రభావంతో లంక ప్రాంతాల్లోని తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనికి తోడు కార్తీకమాసం జత కావడంతో కూరగాయల ధరలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇదే సమయంలో మార్కెట్‌కు వచ్చే కూరగాయలకు మంచి డిమాండ్ వచ్చిపడింది.

అన్నీ పైపైకే

తాడేపల్లిగూడెం మార్కెట్‌లో ఆదివారం ధరలు ఉన్నాయి. కిలో వంకాయలు రూ.120, బెండ రూ.80, బీర కాయలు రూ.80., దొండకాయలు రూ.80, దోస కాయలు రూ.50, కాకరకాయలు రూ.60, అగాకర కాయలు రూ.120, పచ్చిమిర్చి రూ.60, క్యాప్సికం రూ.100, క్యారెట్ రూ.80, బీట్‌రూట్ రూ.80, క్యాబేజీ రూ.40 అమ్ముతున్నారు. ఇక టమాటా విషయానికొస్తే గత వారంతో పోల్చుకుంటే కిలోకి రూ.10 తగ్గింది. గత వారం కిలో రూ.40 ఉంటే ఈ వారం రూ.30కి విక్రయించారు. కాలీఫ్లవర్ పువ్వు రూ.40, జత మునగకాడలు రూ.30, అరటికాయలు జత రూ.20కు అమ్మారు. ఉల్లి ధర మాత్రం స్థిరంగానే ఉంది. నాణ్యమైన మహారాష్ట్ర ఉల్లి పెద్ద సైజు రూ.100కు నాలుగు కిలోలు, మధ్యరకం ఉల్లి రూ.100కు 5 కిలోలు అమ్మారు. నాఫెడ్ ఉల్లి మాత్రం రూ.100కు 6 కిలోలు ఇస్తున్నారు.

దిగిన చికెన్

చికెన్ ధరలు గతవారంతో పోల్చుకుంటే తగ్గింది. స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.240 నుంచి 220, విత్ స్కిన్ కిలో రూ.220 నుంచి 200కు దిగింది. కార్తీకం ప్రభావంతోనే తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ఏలూరు రైతుబజారులో ఇలా..

ఏలూరు రైతుబజారులో వంకాయల ధరలు కిలో రూ.70 పలుకుతున్నాయి. బెండకాయలు రూ.54, కాకరకాయలు రూ.58, దొండకాయలు రూ.56, గోరుచిక్కుడు రూ.58, చిక్కుడు కాయలు రూ.120, క్యారెట్ రూ.60, దోసకాయ రూ.30, పొట్లకాయ రూ.25 ఉన్నాయి. రూ.కొత్తమీర కట్ట రూ.35, మిగిలిన ఆకుకూరలు కట్ట రూ.15 అమ్ముతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఇవే కూరగాయలు రూ.10 నుంచి 20 అదనంగా అమ్ముతున్నారు.



దివ్యాంగులకు మూడు చక్రాల సైకిల్ అందిస్తున్న కలెక్టర్ నాగరాణి , ఆరిమిల్లి కృష్ణతులసీ

దాతృత్వానికి మారు పేరు పశ్చిమ

దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో కలెక్టర్ నాగరాణి

తణుకు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా అంటేనే దాతృత్వానికి మారుపేరు అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివారం డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కమ్మ కల్యాణ మండపంలో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కిరణ్ ఫౌండేషన్ ఛైర్మన్ సతీష్ బొల్లా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ కిరణ్ ఫౌండేషన్ చెర్మన్ సతీష్ బొల్లా తన స్నేహితుడి పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి దివ్యాంగులకు వెన్నంటి ఉంటూ వారి అవసరాలను తీర్చుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు సేవ చేయాలనే లక్ష్యంతో వారికి కృత్రిమ అవయవాలు అందించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సహకారంతో దివ్యాంగులకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసీ మాట్లాడుతూ దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఏర్పాటు చేసిన సంకల్పం-2025 కార్యక్రమం ద్వారా ఎంతో అద్భుతమైన అనుభూతిని పొందగలిగానని తెలిపారు. తణుకు ప్రాంతంలో దాతృత్వం కలిగిన దాతలు ఉన్నారంటే గర్వకారణంగా ఉందన్నారు. భవిష్యత్ తరాలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు స్ఫూర్తి దాయకం అన్నారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ న్యూజిలాండ్ నుంచి వీడియో సందేశాన్ని పంపారు. అనంతరం 100 మందికి కృత్రిమ అవయవాలను అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతో అమరావతికి పునరుజ్జీవం

ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ



న్యూజిలాండ్ ఎన్ఆర్ఐ సమావేశంలో మాట్లాడుతున్న ఆరిమిల్లి

తణుకు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ళ వైసీపీ పాలనలో అమరావతిని వైఎస్ జగన్ భ్రష్టు పట్టించారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. ఆదివారం న్యూజిలాండ్‌లోని ఎన్నారై టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అమరావతికి పునర్జీవం పోశారని చెప్పారు. అమరావతి నిర్మాణంలో పరిపాలనా భవనాలు నిర్మిస్తున్నారని తెలిపారు. గతంలో 70 శాతం అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేశారని, తర్వాత అధికాంలోకి వచ్చిన జగన్‌రెడ్డి కనీసం 6 శాతం పనులు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. మరోవైపు పోలవరం నిర్మాణాన్ని సైతం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని వివరించారు. సీబీఎన్ అనే మూడు అక్షరాలు రాష్ట్రానికి బ్రాండ్ భవిష్యత్ అన్నారు. అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో 16 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. జగన్ శాశ్వతంగా ముఖ్యమంత్రిగా ఉంటానని భావించి రూ.500 కోట్లతో ప్యాలెసు నిర్మించుకున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో విశాఖకు పెట్టుబడులు పెట్టేందుకు ఎంతోమంది ముందుకు వస్తున్నారని చెప్పారు.

పాలకొల్లులో ఉత్సాహంగా టెన్నిస్ పోటీలు

క్వాలిఫై అయిన 32 మంది క్రీడాకులు

పాలకొల్లు టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కాస్మోకల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్‌లో జరుగుతున్న ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు రెండవ రోజు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. శని, ఆదివారాల్లో పోటీలు నిర్వహించగా క్వాలిఫై పోటీల్లో 32 మంది మొయిన్ డ్రాకు ఎంపికైె నట్టు ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు (బూన్‌రాజు) తెలిపారు. క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల్లో 82 మంది క్రీడాకారులు (45, 55, 65, 70 సంవత్సరాల వయస్సు) పాల్గొన్నారని తెలిపారు. సీనియర్స్ టెన్నిస్ ర్యాంకింగ్ ఉన్న వివిధ రాష్ట్రాలకు చెందిన 72 మంది సోమవారం ఉదయం 8 గంటల నుంచి నరసాపురంలోని 2 కోర్టుల్లోనూ, పాలకొల్లులోని 2 కోర్టులలోనూ ఆడతారని తెలిపారు. పోటీలకు అంపైర్లుగా వినుకొండ దినేష్ (నరసాపురం), పి.వర్మ (పాలకొల్లు), ఎన్ శ్రీనివాసరాజు(నరసాపురం), కిరణ్ (పాలకొల్లు) వ్యవహరిస్తారని, మ్యాచ్ చీఫ్ రిఫరీగా హైదరాబాద్‌కు చెందిన సంతోష్ వ్యవరిస్తారని బూన్ రాజు వివరించారు. సోమవారం సాయం త్రం జరిగే కార్యక్రమంలో మంత్రి నిమ్మల ముఖ్య అతిథిగా హాజరవుతారని, కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

అట్టడుగు వర్గాలకు ఉచిత న్యాయసేవలందాలి

ఏలూరులో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అట్టడుగు వర్గాలకు, ఆపదలో ఉన్న వారికి, వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు, బాలలకు, స్ర్తీలకు న్యాయసేవలు అందించడంలో న్యాయ సేవాధికార సంస్థలు సఫలీకృతమయ్యాయని ఏలూరు జిల్లా 7వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస రావు అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ భవనంలో ఆదివారం నిర్వహించారు. శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత న్యాయ సేవలను సమాజంలో మారుమూల జీవిస్తున్న ప్రజలకు చేరువ్వడానిక ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు న్యాయ సేవాధికార సంస్థలు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తాయన్నారు. అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వారికి ఉచిత న్యాయ సేవలను అందించడంలో న్యాయ సేవాధికార సంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయని ముఖ్యంగా క్రిమినల్ కేసులలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సేవలను అందిస్తున్నారని బడుగు, బలహీన వర్గాల వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ గత నవంబర్ 9వ తేదీ నుంచి నేటి వరకు 18,000 పైబడి కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీ చేశామని, ప్రత్యేక మధ్యవర్తిత్వం ద్వారా గత మూడు నెలల నుంచి వివిధ కేసులలో ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ నిర్వహించి 200కు పైగా కేసులను రాజీ చేశామన్నారు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందడంలో న్యాయపరమైన సమస్య ఎదురైన వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించాలని సూచించారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి సాయితేజ మాట్లాడుతూ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులను కూడా పరిష్కరించుకోవడానికి కక్షిదారులు ముందుకు రావాలని అలాగే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని సూచించారు. ఏలూరు అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారామ్, ప్రభుత్వ న్యాయవాది బీజే రెడ్డి , రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు లీలా కృష్ణ, పోలీస్ అధికారులు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా మావుళ్లమ్మ పడిపూజ

భీమవరం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మావుళ్లమ్మ అమ్మవారి దీక్ష తీసుకున్న భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భీమవరం మావుళ్లమ్మ ఆలయం వద్ద భారీ సెట్టింగ్‌తో అమ్మవారికి వైభవంగా పడిపూజ నిర్వహించారు. ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి హారతులను అందించారు. అమ్మవారి నామస్మరణతో ఆ ప్రాంతం మారు మోగింది.అమ్మవారి భక్తులచే నిర్వహించిన భజన కార్యక్రమంతో ఆధ్యాత్మిక నిండిపోయింది. ఈవో బుద్ధామహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు.



పడిపూజలో పాల్గొన్న భక్తులు,మాలధారులు



డిస్పోజబుల్, ప్లాస్టిక్ గొడౌన్‌లో అగ్నిప్రమాదం

సుమారు రూ. రెండు లక్షల ఆస్తి నష్టం

జంగారెడ్డిగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జంగా రెడ్డిగూడెం పట్టణంలో రెండంతస్తుల భవనంలో ఆదివారం అగ్నిప్రమాదం జరగడంతో ఆ భవనంలో నివాసం ఉండేవారితో పాటు చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. బుట్టాయగూడెం రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రాజస్థాన్‌కు చెందిన శంకర్ అనే వ్యక్తి కొన్నేళ్లుగా డిస్పోజల్ గ్లాసులు,ప్లేట్లు మొదలైన వస్తువులను గ్రామాల్లో ఉన్న కిరాణా, ఫ్యాన్సీ దుకా ణాలకు హోల్‌సేల్‌గా సరఫరా చేస్తున్నాడు. పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా కొంకిమళ్ళ రాజ్ కుమార్ అనే వ్యక్తి కు చెందిన భవనంలోని మొదటి ఫ్లోర్‌లో కొంత భాగం గొడౌన్ నిమిత్తం శంకర్ అద్దెకు తీసుకున్నాడు. అదే భవనంలో రెండవ అంతస్తులో భవన యజమాని రాజ్‌కుమార్, శంకర్ కుటుంబం కూడా నివాసం ఉంటున్నారు.ఆదివారం సాయంత్రం మొదటి అంతస్తులోని కిటికీలో నుంచి పొగలు రావడంతో స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు వచ్చిన అగ్నిమాపక సిబ్బంది, ఎస్సై ఎస్.వీర ప్రసాద్ మంటలను అదుపు చేశారు. దట్టమైన పొగ కమ్మేయడంతో అందులో నివాసం ఉండే వారంతా రాత్రంతా ఇంటి బయటే ఉండవలసి వచ్చింది. గొడౌన్ యజమాని అందుబాటులోకి రాలేదని అగ్నిమాపక శాఖాధికారి జి.అబ్రహం తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉంటుందన్నారు. సుమారు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని బావిస్తున్నట్లు తెలిపారు.



ద్వారకాతిరుమల మండలం రామన్నగూడెం పరిధిలోట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్సై సుధీర్

ట్రాన్స్‌ఫార్మర్లు పగులకొట్టి కాపర్ వైరు చోరీ

ద్వారకాతిరుమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంటపొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలకొట్టి చేసి కాపర్ వైర్లను దోచుకెళ్లడం ద్వారకాతిరుమల మండలంలో ఇటీవల ఎక్కువయ్యాయి. ఆదివారం మండలంలోని రామన్నగూడెం పంచాయతీ పరిధిలో ఇటువంటి దొంగతనం వెలుగుచూడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు నష్టపోవడమే కాకుండా సకాలంలో పంటలకు తడి అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామన్న గూడెం పంచాయతీ పరిధిలో ఇద్దరు రైతులకు చెందిన పొలంలో శనివారం అర్ధరాత్రి కొందరు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌వైరు తస్కరించారు.రైతులు సయ్యద్ బడే సాహెబ్, కొడవగంటి ఆనందరావులు ఆదివారం ఉద యం పొలంలోకి వెళ్లి చూసేసరికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ధ్వంసమై కన్పించాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సుధీర్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు.

క్రైం కార్నర్

మద్యం తాగద్దన్నందుకు ఆత్మహత్య

పెదవేగి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుక్క కాటుకు గురైన వ్యక్తిని మద్యం తాగవద్దని చెప్పినందుకు మనస్థాపానికి గురైన వ్యక్తి కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. ముండూరు శివారు వెంగంపాలెం గ్రామానికి చెందిన చలపాటి వెంకటేశ్వరరావు నిత్యం మద్యం సేవిస్తుంటాడు. అతనిని కొద్దిరోజుల కిందట కుక్క కరిచింది. దీంతో మద్యం తాగవద్దని అతని భార్య చెప్పింది. మనస్థాపానికి గురైన వెంకటేశ్వరరావు శనివారం సాయంత్రం కలుపు నివారణకు ఉపయోగించే మందును తాగేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావు (77) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఆరుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

పెదవేగి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేకాట జరుగుతుందనే సమాచారంతో దాడిచేయగా ఆరుగురు జూదరులు దొరికారని పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. లక్ష్మీపురం పంచాయతీ ఎంఆర్‌సీ కాలనీలో పేకాట ఆడుతున్న పక్కా సమా చారంతో దాడి చేశామని, ఈ సమయంలో పేకాట రాయుళ్లు పారిపోతుండగా వెంబడించి ఆరుగురు జూదరులను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.7150 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

టి.నర్సాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు ఆదివారం తెలిపారు. మక్కినవారిగూడెం పంచాయతీలోని కొల్లివారిగూడెం గ్రామానికి చెందిన కుసిని నాగమణికి (30) వివాహమైంది. ఇద్దరు సంతానం. నాగమణి మక్కినవారిగూడెంలో బట్టల షాపు పెట్టి నడుపుతోంది. అప్పు తెచ్చి స్టాక్ తీసుకు రావద్దని ఇప్పటికే చాలా అప్పులు అయ్యాయని ఉన్న సరుకునే అమ్ముకోమని భర్త మందలించటంతో నాగమణి ఈనెల 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు బట్టషాపు దగ్గరకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికి ఆమె ఆచూకీ తెలియలేదు. నాగమణి తండ్రి గోపిన మద్దిరాములు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై వెళ్తున్న వారిని మరో మోటారు సైకిల్ ఢీకొనడంతో ఒక వ్యక్తి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఏలూరు కుమ్మరరేవునకు చెందిన మెడే కృష్ణ (45) టైల్స్‌పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం ఉదయం తన స్నేహితుడైన రాజును ఎక్కించుకుని మార్కెట్‌కు వెళ్లాడు. పర్సు ఇంటి వద్ద మర్చిపోవడంతో తిరిగి పర్సుకోసం ఇంటికి వెళ్ళే నిమిత్తం వసంతమహల్ వద్ద మోటారు సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా ఒక బులెట్ అతి వేగంగా ఢీకొనడంతో కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.



అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

భీమవరం క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భీమవరం నుంచి ఏలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. డివైడర్ లేకపోతే అక్కడ పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు చెబుతున్నారు. సుమారు 30 మందితో వెళ్తున్న ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం మధ్యాహ్నం ప్రమాదానికి గురైంది. బస్సులో ఉన్నవారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కాలంలో వరుస బస్సు ప్రమాదాలు ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. బస్సు ఎక్కాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి.

రేపటి నుంచి క్రైస్తవ పుస్తక ప్రదర్శన

ఏలూరుటూటౌన్, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): బ్యూటిఫుల్ బుక్స్ చెన్నై ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు అమీనపేట పోలీస్ కళ్యాణ మండపంలో క్రైస్తవ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు ఎల్ఈఎఫ్ చర్చి నిర్వాహకులు బ్రదర్ సురేశ్ మార్కస్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రదర్శనలో బైబిల్ గ్రంథాలు, కామెంట్రీలు, క్రైస్తవ రచనలు, భక్తుల జీవిత చరిత్రలు, చిన్నారులకు, యవ్వనులకు అవసరమైన కథలు, పాటల పుస్తకాలను అతి తక్కువ ధరలకే అందిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి
ఏలూరు
ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు, చింతలపూడి, పోలవరం
8 www.andhrajyothy.com ● సోమవారం 10 నవంబరు 2025

విశేష అలంకరణలో కుంకుళ్లమ్మ



ద్వారకాతిరుమల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): క్షేత్రదేవతగా కొలువైన కుంకుళ్లమ్మ ఆదివారం భక్తులకు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీవారి దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో భక్తులు ఈ అమ్మవారిని దర్శించడం అనవాయితీ. కార్తీక మాసం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేక పుష్పాలతో కొలువుదీరిన అమ్మవారిని భక్తులు దర్శించి తరించారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం : చింతమనేని



సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తూ, ఆర్థిక భరోసా కల్పిస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఆదివారం దుగ్గిరాల కార్యాలయంలో పలు గ్రామాలనుంచి వచ్చిన ప్రజల వినతులను పరిశీలించారు. పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. కూచింపూడికి చెందిన సీహెచ్.శివాజీ ఇటీవల జరిగిన డీఎస్సీలో ఉద్యోగం వచ్చినప్పటికి మార్కుల గణన ప్రక్రియలో ఆలస్యం కాగా ఇప్పుడు తాజాగా ప్రభుత్వం ఉద్యోగ నియామక పత్రాన్ని పంపించింది. ఈ నియామక పత్రాన్ని శివాజీకి అందించి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏడాది డీఎస్సీ ఉంటుందని విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే ప్రకటించారని, నిరుద్యోగులకు ఇదొక వరమని తెలిపారు.

హాస్టల్ నిర్వహణ లోపం వల్లే ఎలుకల దాడి : ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్

ఏలూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యకళాశాల వైద్య విద్యార్థులపై ఎలుకల దాడి ఘటనపై ఎస్ఎఫ్ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఏలూరులో ఎస్ఎఫ్ఐ నాయకులు నిర్వహించిన సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి లెనిన్ మాట్లాడారు. నిద్రిస్తున్న వైద్యవిద్యార్థులపై ఎలుకలు దాడిచేసి ముఖం, కాళ్లు చేతులపై తీవ్రగాయాలు చేయడం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. వైద్యకళాశాల వసతిగృహం నిర్వహణలో ఘోరవైఫల్యాన్ని ఈ దుర్ఘటన తెలియజేస్తోందన్నారు. వసతిగృహంలో సీసీటీవీ సిస్టం, సెక్యూరిటీ గార్డులు, ఎమర్జెన్సీ అలారం సిస్టంలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు నాగేంద్రబాబు, శివ, జయంతు, నాని పాల్గొన్నారు.

ఆల్ ఇండియా పాస్టర్స్ జిల్లా అధ్యక్షుడిగా సాల్మన్‌రాజు



ఎన్నికైన వారిని సత్కరిస్తున్న సీఎస్ఐ సంఘస్తులు

పెదపాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) :ఏలూరు జిల్లా ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) నాయుడుగూడెం ప్యారిస్ గురువులు జి.సాల్మన్‌రాజు, సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన పాస్టర్ పొలిమెట్ల బాబూరావులను పెదపాడు మండలం పునుకొల్లు సీఎస్ఐ సంఘస్తులు, గ్రామస్థులు ఆదివారం ఘనంగా సత్కరించారు. జిల్లా, మండల అధ్యక్షులుగా ఎన్నికై పునుకొల్లు దేవాలయానికి విచ్చేసిన వారిద్దరికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవుని వ్యాక్యాన్ని బలపరుస్తూ సంఘం అభివృద్ధికి, పాస్టర్ల సంక్షేమానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. సంఘస్తులు పొలిమెట్ల ఏలియా, సంగీతరావు, డేవిడ్, చిలుకూరి శికామణి, దేవరపల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.

'ఐటీడీఏ పీవోపై చర్యలు తీసుకోవాలి'

బుట్టాయగూడెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులతో కలిసి అవినీతికి పాల్పడుతున్న కేఆర్‌పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరావు, సహాయ కార్యదర్శి కారం భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం గుంజవరంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్వాసితులకు, గిరిజనులకు అండగా ఉండాల్సిన పీవో కూటమి నాయకులతో కలిసి కుక్కునూరు, ఏలేరుపాడు మండలాల్లో నిర్వాసితుల పరిహారం విషయంలో అవినీతికి పాల్పడడం బాధాకరమన్నారు. పీవోపై విచారణ జరిపి చర్యలు చేపట్టకుంటే ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వ ర్యంలో పెద్దయెత్తున ఆందోళనకు దిగుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, దుర్గారావు, రామిరెడ్డి, భీమరాజు గిరిజనులు పాల్గొన్నారు.

'నారాయణ దత్త సొసైటీ సేవలు ప్రశంసనీయం'

ఏలూరు రూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి):స్థానిక పడమర వీధి, వంగాయగూడెం సెంటర్ దగ్గర నారాయణ దత్త ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రంలో హాస్పిటల్ సహకారంతో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, ఎక్స్‌రే, మహిళలకు క్యాన్సర్‌కు సంబంధించి పాప్‌స్మీర్, స్క్రీనింగ్ పరీక్షలు ప్రత్యేకంగా నిర్వహించారు. శిబిరాన్నీ ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్, రెడ్డి అప్పలనాయుడు ప్రారంభించారు. ఎమ్మార్డీ ఈశ్వరి బలరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ఎం.శివశంకర్ వైద్యం ఖరీదైన నేపథ్యంలో పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో నారాయణ దత్త సొసైటీని ఏర్పాటు చేసి ఇప్పటివరకు 44 ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా మందులు, పండ్లు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు వీరంకి త్రినాథరావు, వి.రాజగోపాల్, పరస శ్రీనివాసరావు, వీరంకి రాజగోపాల్, వీరంకి పండు, పల్లి విజయ్‌కుమార్, శనగల శివకుమార్, ఎం.శివశంకర్, బాలిన సత్యనారాయణ, మరిదు వెంకట్రావు పర్యవేక్షించారు.

ప్రేమాలయం నూతన కార్యవర్గం నియామకం

ఏలూరు రూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మాదేపల్లి రోడ్డులోని వృద్ధాశ్రమం ప్రేమాలయం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ప్రేమాలయం అధ్యక్షుడు వెంకటేష్ గురూజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రేమాలయం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఇప్పటివరకు అధ్యక్షుడిగా వ్యవహరించిన వెంకటేష్ గురూజీ ఇకపై గౌరవ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఇప్పటివరకు గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించిన టి.వి సుబ్బారావు నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కొనసాగిన ఎంఎస్‌వీ మురళీ కృష్ణ నూతన ఉపాధ్యక్షుడిగా, ఇంకా నూతన ఉపాధ్యక్షులుగా అలపాటి నాగేశ్వరరావు, బీవీ సుబ్రహ్మణ్యం, గొర్ల రామారావు ఎన్నికయ్యారు. ఇప్పటివరకు కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన ఎం.రాంబాబు, నూతన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా ఎంజీఎం వెంకటరత్నం, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా మానేపల్లి సత్యనారాయణ నియమితులయ్యారు.

తీరనున్న దాహార్తి

(5వ పేజీ తరువాయి)



జంగారెడ్డిగూడెంలో 2018లో వేసిన శిలాఫలకం

ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు నిర్మించి అక్కడి నుంచి పైప్ లైన్ల ద్వారా ఇంటింటికీ మంచినీటిని అందచేస్తారు. ఈ పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని గాడిలోకి తెచ్చారు. ప్రస్తుతం ఈ పథకం టెండరు దశలో ఉందని టెండరు పూర్తవగానే పనులు ప్రారంభిస్తామని పబ్లిక్ హెల్త్ ఈఈ కె.ఫణిభూషణ రావు తెలిపారు.

శుద్ధి చేసిన మంచినీటిని అందజేస్తాం



పట్టణంలో సుమారు పదివేల కుళాయిల ద్వారా శుద్ధి చేసిన మంచినీటిని ప్రజలకు అందచేస్తాం. ప్రస్తుతం ప్రజలకు మంచినీరు అందించడానికి బోర్లు, మోటార్లు రిపేర్లు, కొత్తవి కొనడంతో పాటు విద్యుత్ బిల్లులు చెల్లించడానికి ఏటా రూ.3కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఏఐబీ పథకం డైరెక్టు పంపింగ్ స్కీము కావడంతో విద్యుత్ బిల్లుల సమస్య ఉండదు. మున్సిపాలిటీ ఏడాదికి రెండు కోట్లు పథకం మెయింటెనెన్స్ కోసం ఖర్చు చేసినా రూ.కోటి మేర మిగిలే అవకాశాలున్నాయి.

- కేవీ రమణ, మున్సిపల్ కమిషనర్, జంగారెడ్డిగూడెం



దొండపాడులో నారాయణమూర్తిని సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు



పోతునూరులో యాదవ సంఘం వన సమారాధనలో నాయకుల సందడి



చింతలపూడి వన భోజన కార్యక్రమంలో వైద్య పరీక్షలు జరుపుతున్న దృశ్యం

ఉత్సాహంగా కార్తీక వనసమారాధనలు

హేలాపురి అర్చసేవా సమితి ఆధ్వర్యంలో..

ఏలూరు రూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి):కార్తీక వన సమారాధన అనేది ప్రకృతిలో మనిషికి ఉన్న బంధాన్ని గుర్తు చేసే ఒక ఆచారమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు నోరి నారాయణ మూర్తి అన్నారు. హేలాపురి అర్చసేవా సమితి ఆధ్వర్యంలో బ్రాహ్మణులు కార్తీక వన సమారాధన మహోత్సవం దొండపాడులోని అద్దంకి రాంబాబు తోటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి ధార్మిక ప్రవచనం చేశారు. భోజనాల సంప్రదాయం ఆధ్యాత్మిక చింతనతో పాటు హైందవ ధర్మాన్ని చాటి చెబుతుందన్నారు. మరో అతిథి రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ సత్యవాడ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బ్రాహ్మణ సామాజిక వర్గంలోని అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో డిసెంబరు 13న గుంటూరులో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 70 సంస్థలు తరలివస్తున్నాయన్నారు. విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇటీవల ఆయా దేవ స్థానంలో ధర్మకర్తలుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. సమితి అధ్యక్షుడు నేతి వెంకటరామయ్య, కార్యదర్శి ప్రసాద్, మంత్రి ప్రగడ శ్రీహరిరావు, ఈదర రమణప్రసాద్, టి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో ముందుండాలి

దెందులూరు : యాదవులు విద్య, వైద్య, రాజకీయ అన్ని రంగాల్లో ముందుండాలని యాదవ్ సంఘం జిల్లా నాయకులు నున్న లక్ష్మణ్‌బాబు, తలారి రామకృష్ణ అన్నారు. ఆదివారం పోతునూరులో యశోద కృష్ణ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సామాజిక వర్గంలో వెనుకబడిన వారిని ముందుకు తీసుకుని వచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్దామన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక వనభోజనాలు నిర్వహించారు. యశోదకృష్ణ యాదవ్ సంఘం నాయకులు పాల్గొన్నారు

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

చింతలపూడి : పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆట పాటలు, పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు వజ్రపు శేఖర్ మాట్లాడుతూ కార్తీకమాసంలో వన సమారాధనలు ఐక్యతకు, ఆధ్యాత్మికంగా ఉంటాయని, ఈ సంప్రదాయాలు సమాజానికి మేలు చేస్తాయన్నారు. సీహెచ్.అబ్బయ్య, పులిపాటి హరికృష్ణ, వెంకటరమణ, అడపా శ్రీను సేవలందించారు.



రాజానగరం పాఠశాలలో 1999-2000లో టెన్త్ చదివిన విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

బుట్టాయగూడెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని రాజానగరం గిరిజన పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. టెన్త్ పూర్తిచేసి 25 ఏళ్లు కావడంతో అందరూ కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. సమ్మేళనానికి కృషి చేసిన కూరం జయ, కలుము వెంకట్, ఇరపా అమ్మాజీ, పండు , చిన్నబాబు, కోర్స రాజు, తెల్లం లక్ష్మణ్‌లను అభినందించారు.



తిమ్మాపురంలో కార్తీక వనసమారాధనలో పూర్వవిద్యార్థులు

తిమ్మాపురంలో ఆత్మీయ కలయిక

ద్వారకాతిరుమల :కార్తీక వనసమారాధన పేరిట వారంతా ఓ చోట కలుసుకున్నారు. మూడు దశాబ్దాల క్రితం వారు ఒకే పాఠశాలలో కలసిమెలసి తిరిగారు. పదో తరగతి పూర్తయ్యాక పలు రంగాల్లో స్థిరపడ్డారు. ఇప్పుడు వారంతా తిమ్మాపురంలో కలుసుకుని గత మధురస్మృతులను పంచుకుని సందడి చేశారు. ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం జడ్పీ పాఠశాలలో 1993-1998 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు కార్తీక వనసమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు.



అంకన్నగూడెంలో బయో రిసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

'బయో రిసెర్చ్ కేంద్రంతో రైతులకు మేలు'

జీలుగుమిల్లి, నవంబరు 9 : (ఆంధ్రజ్యోతి) : ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫామింగ్(ఏపీసీఎన్ఎఫ్) ద్వారా గిరిజన ప్రాంతంలో బయో రిసెర్చ్ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. అంకన్నగూడెంలో ప్రకృతి వ్యవసాయం, రైతు సాధికార సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. సమీప గ్రామాల గిరిజన రైతులకు, ప్రజలకు ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన కల్పించాలన్నారు. సర్పంచ్ పైదా ముత్యాలమ్మ, జడ్పీటీసీ మల్లం వసంత్, జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షుడు సరిపల్లి సత్యనారాయణరాజు, టీడీపీ నాయకులు సాయం ప్రకాష్, శేఖర్, డ్వాక్రా మహిళా సంఘాల లీడర్లు ఉన్నారు.



ఎంపికైన కొయ్యలగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ సభ్యులు

వ్యాపారుల అభివృద్ధికి కృషి చేస్తా

కొయ్యలగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యాపారుల అభివృద్ధికి కృషి చేస్తానని కొయ్యలగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మద్దు మోహన్ అన్నారు. ఆదివారం స్థానిక రేపల్లెవాడలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వనసమారాధన, అనంతరం నూతన కమిటీ ప్రమాణస్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, పెద్ద వ్యాపారస్థులందరూ కలిసి ముందుకు సాగాలన్నారు. వ్యాపారంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా వాటి పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేస్తుందన్నారు. నూతన కమిటీలో ప్రధాన కార్యదర్శిగా గొలిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారిగా కర్పూరపు సత్యనారాయణ ఎన్నికయ్యారు. పలువురు వ్యాపారవేత్తలు, నాయకులు, పాల్గొన్నారు.



చెస్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి) : అబ్రహం గ్యారీ కాస్పరోవ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో గోపన్నపాలెంలోని ఎస్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ కళాశాలలో ఏలూరు జిల్లా ఓపెన్ డిస్ట్రిక్ట్ చెస్ టోర్నమెంట్ నిర్వహించినట్టు అకాడమీ డైరెక్టర్ తెలిపారు. పోటీలను ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నతానియల్ ప్రారంభించారు. క్రీడాకారులు ఉత్సాహంగా చదరంగం పోటీలో పాల్గొని ఎత్తులకు పైఎత్తులు వేస్తూ విజయం కోసం పోరాడారు. పోటీల్లో ఎం.ఆశ్రమ్ బెన్నీ, ఎం.ఆశిష్‌పాల్, టి.అజయ్, సీహెచ్ మోక్షజ్ఞ, ఎ.జస్విన్ విజేతలుగా నిలిచారు. వయస్సు గ్రూపుల వారీగా ఎ. రితిక్, సీహెచ్ అఖిలేష్, కె.శ్రీజ, సాత్విక, ధర్మవతి, బి. మోక్షిత్, శ్యామ్ గెలుపొందారు. వీరికి మెమెంటోలు ప్రశంసా పత్రాలు అందజేశారు. అకాడమీ సెక్రటరీ అరుణ ఆర్బిటర్ కె. రాజుష్ పర్యవేక్షించారు.

'పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి'

కుక్కునూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంద నాయకులు కోరారు. ఆదివారం కుక్కునూరులో వ్యాపారులతో సమావేశం జరిగింది. పత్తి క్వింటాకు రూ.8110 వ్యాపారస్థుల వద్ద రైతులు తీసుకున్న పెట్టుబడులకు వడ్డీ రూ.2 తీసుకోవాలన్నారు. పురుగుమందులు కొనుగోలు సమయంలో డబ్బులు చెల్లిస్తే లీటరుకు రూ.550, అప్పు అయితే రూ.1500 - 1600 తీసుకోవడం ప్రజాపంద నాయకులు వ్యాపారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులు తీసుకుంటున్న పురుగు మందులు ఎరువులకు బిల్లులు ఇవ్వాలని వ్యాపారులను కోరారు. జిల్లా కార్యదర్శి ఎస్కే.గౌస్, బిసత్యనారాయణ, చంద్రరావు, కల్లయ్య, వ్యాపారులు ఫరీద్‌బాబా, విశేశ్వరరావు, రామిరెడ్డి, గుప్తా, వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన పీటీఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ నాయకులు

పీటీఎస్ఎఫ్ జిల్లా శాఖ నూతన కార్యవర్గం

ఏలూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) :పేరెంట్స్, టీచర్స్ అండ్ స్టూడెంట్ ఫెడరేషన్ (పీటీఎస్ఎఫ్) జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏలూరులో జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ అసీన్, ఎం.జయలక్ష్మి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా సింగరాజు, రవితేజ, కార్యవర్గ సభ్యులుగా భారతి, స్వాతి యాదవ్, లక్ష్మిలను ఎన్నుకున్నారు. తొలుత జరిగిన సంఘ సమావేశంలో పీటీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లాపు వేణు మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు దోపిడి, విద్యార్థులపై ఒత్తిళ్లు, ఆత్మహత్యలను అరికట్టేందుకు కార్యాచరణను అమలు చేస్తూనే ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతంచేసేందుకు సంఘ నాయకులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దీపక్ మాట్లాడుతూ పీహెచ్‌డీ విద్యార్హతలతో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు నెలకు రూ.20 వేలు మాత్రమే జీతాలు చెల్లిస్తున్న పలు యాజమాన్యాలు దస్త్రాల్లో మాత్రం రూ.లక్ష చెల్లిస్తున్నట్టుగా సంతకాలు చేయించుకుంటూ శ్రమదోపిడికి పాల్పడుతున్నాయని ఆరోపించారు. సంఘ రాష్ట్ర నాయకులు కుమార్‌బాబు, ఉదయ్‌కుమార్, సత్యనారాయణరాజు, జంపాలరావు, షేక్ కరీమున్నీసా బేగం, కె.భీమయ్య, సురేష్‌బాబు, సంధ్యచౌదరి, పార్వతీదేవి, సీతాదేవి, సత్య, రమణకుమారి, మీనాక్షిరెడ్డి, లీలావతి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు సాహితి, అక్షయ ఎంపిక



నవ్యసాహితి, అక్షయ

ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఏలూరులోని లిటిల్ మాస్టర్స్ చెస్ అకాడమికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. 69వ ఏపీ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పార్వతీపురం జిల్లా జోగంపేటలోని గురుకులంలో ఈనెల 7,8,9 తేదీలలో విద్యార్థినులకు రాష్ట్రస్థాయి చెస్ పోటీలను నిర్వహించారు. ఏలూరు లిటిల్ మాస్టర్స్ చెస్ అకాడమిలో విజయవాడకు చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని పెద్ది నవ్యసాహితి, పదో తరగతి చదువుతున్న విద్యార్థిని అట్లా అక్షయ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో రాష్ట్రం తరపున జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌లో బెంగళూరులో డిసెంబరు 5,6,7 తేదీలలో జరిగే చెస్‌పోటీలలో పాల్గొననున్నారు. వీరిని ఏలూరు లిటిల్ మాస్టర్స్ చెస్ అకాడమి డైరెక్టర్ దేవరపల్లి లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ హైమా చంద్రకుమారి అభినందించారు.

'దళితులంతా సమైక్యంగా ఉండాలి'



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న దళిత నేతలు

లింగపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): దళితులంతా సమైక్యంగా ఉండాలని, దళితుల అభివృద్ధికి కృషి చేయాలని లింగపాలెం మండల దళిత ఐక్యవేదిక నాయకులు అన్నారు. ధర్మాజీగూడెంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాడేపల్లి దాస్‌బాబు ఆధ్వర్యంలో దళిత ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పల్లి శ్రీను ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దళితులంతా ప్రతి దళిత ఉద్యోగి సాటి దళితులను ఉన్నతస్థాయికి చేరుకునేలా కృషి చేయాలన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో దళితులంతా టీడీపీ అండగా ఉండాలని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సారథ్యంలో ముందుకు నడవాలన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాళ్ల సుజీవరావు, మహిళా అధ్యక్షురాలు కొత్తూరి నాగమణి, ఉప్పే శోభరాజ్యం, తొమ్మం ద్రుమల్లయ్య, కొండ్రు దేవా, ఏఎంసీ డైరెక్టర్ డోలా విజయ్, శ్రీకాకొల్లు వెంకట నాగేశ్వరరావు, పొదిల శౌరి, మాముదూరి మహంకాళి, అసిలేటి అజయ్, పలువురు దళితనాయకులు పాల్గొన్నారు.

'ప్రతి గృహిణి స్వయం ఉపాధితో ఎదగాలి'

ద్వారకాతిరుమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి గృహిణి స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని ఎదగడమే లయన్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు మనోజ్ జాంగ్రా లక్ష్యమని ఏపీ లయన్ రాష్ట్ర అధ్యక్షురాలు బోసేపల్లి సంధ్య అన్నారు. ద్వారకాతిరుమలలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. అట్టడుగు వర్గాల వారిని ఉన్నత స్థితికి చేర్చాలన్న లక్ష్యంతోనే లయన్ సంస్థను స్థాపించారన్నారు. పంజాబ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్‌లలో సంస్థ తన కార్యకలాపాలు ప్రారంభించిందన్నారు. సంస్థ ద్వారా గ్రామాల్లోని నిరుపేద గృహిణులకు కుట్టుమిషన్లు, వంట నూనెలు తయారీ, కారం పొడి, మసాలాలు, గోధుమపిండి వంటివి ఉత్పత్తి చేసే విధంగా వాటికి సంబంధించి మిషన్లు ఇచ్చి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సొంత గ్రామమైన ద్వారకాతిరుమల శ్రీవారి సన్నిధి నుంచి సంస్థ కార్యకలాపాలను ప్రారంభిస్తున్నామన్నారు. సంస్థ సభ్యుడు టి.ప్రసాద్ పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ఏలూరు క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏదైనా ప్రమాదంలో ఉన్నప్పుడు అత్యవసరంగా పోలీస్ సహాయం కోసం డయల్ 112కు కాల్ చేయాలని ఏలూరు జిల్లా శక్తిటీమ్ పోలీసులు సూచించారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో శక్తి టీమ్ పోలీసులు ఆదివారం ఏలూరు అమీనాపేటలో ఉన్న బీసీ వసతి గృహాల వద్ద విద్యార్థులక శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

కంచె తొలగించాలని ఆందోళన

టి.నరసాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అల్లంచర్లరాజుపాలెం పంచాయతీలోని కొత్తగూడెం జగనన్న కాలనీకి వెళ్లే దారికి అడ్డంగా కంచె వేయడంతో స్థానిక కాలనీవాసులు ఆదివారం ఆందోళన చేశారు. జగనన్న కాలనీ నిర్మాణ సమయంలో దారి ఏర్పాటు చేయకుండా కాలనీవాసులు రాకపోకలు సాగిస్తున్నారని ఆ దారిభూమి తనదని స్థానిక రైతు దారికి అడ్డంగా కంచె వేశాడు. ఈ విషయంపై వీఆర్వో దత్తును వివరణ కోరగా సమస్య పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఏలూరు రూరల్, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి):హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఏ) ఏలూరు ఆధ్వర్యంలో విజయ హాస్పిటల్స్ రితేష్ హార్ట్ కేర్ సహకారంతో ఆదివారం ఉదయం వైఎంహెచ్ఏ హాలులో ఉచిత మెగా గుండె, నేత్ర, జనరల్ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కళారత్న కేవీ సత్యనారాయణ ప్రారంభించారు. వైద్య నిపుణులు పి.రితేష్ గుండె పరీక్షలు, నేత్ర వైద్య నిపుణులు జి.తేజస్వి, జనరల్ ఫిజీషియన్ ఎం.రాంబాబు సుమారు 150 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసీజీ, ఎకో, బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించారు. యర్రా సోమలింగేశ్వరరావు, యిరదల ముద్దు కృష్ణ, వేమా కోటేశ్వరరావు, సీహెచ్ సాయి తేజ, కానాల బాల వెంకట రమేష్, బొప్పన వెంకటరాజు, సభ్యులు మురళీకృష్ణ, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పెదపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెదపాడు ఎస్ఐ కట్టా శారదాసతీశ్ తెలిపారు. ఆదివారం పెదపాడు బస్టాండ్ సెంటర్, కలపర్రు టోల్‌గేట్ వద్ద సిబ్బందితో కలిసి పలు వాహనాలను తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అతివేగంగా వాహనాలు నడపటం, మద్యం సేవించి వాహనాలు నడపటం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం జరుగుతుందన్నారు. వాహన తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణ రెడ్డి వర్ధంతి

చింతలపూడి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగుంటపల్లిలో కామ్రేడ్ కారుమూడి సత్యనారాయణరెడ్డి 28వ వర్ధంతి సభ ఆదివారం జరిగింది. సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ కారుమూడి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పనిచేసిన వ్యక్తి అన్నారు. 1944లో చింతలపూడి ప్రాంతంలో సీపీఐ తాలూకా శాఖ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించిన వ్యక్తి అన్నారు. తొలుత సీపీఐ జెండాను ఆవిష్కరించారు. జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, తలారి గంగరాజు, కారుమూడి రమేష్, ఎ.సుబ్బారావు, పి.శ్రీరామాచార్యులు, పి.బాబు, పి.సోమశేఖర్, దొంత కృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొయ్యలగూడెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌సీఎం సంస్థల విచారణ గురువు రాజులపాటి రోషరియు అన్నారు. ఆదివారం బయ్యన్నగూడెంలో జంగారెడ్డిగూడెం నిర్మల మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌సీఎం సంస్థల ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు పేద ప్రజలు అందిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా తమ సంస్థల ద్వారా అన్ని పేద గ్రామాల్లోనూ ఉచిత మెగా వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

లింగపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఏఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. లింగపాలెం మండలం ముడిచర్లలో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి వారివద్ద నుంచి రూ.1,870 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

రంగాపురంలో అయ్యప్పలకు అన్నదానం

ముదినేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రంగాపురంలోని షిర్డి సాయిబాబా మందిరం వద్ద ఆదివారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక అన్నసమారాధన నిర్వహించారు. గురుస్వాములు వేల్పూరి నానాజీ, నాని స్వామి అయ్యప్పకు, బాబాకు పూజలు చేశారు. అనంతరం దాకరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పేరూరుకు చెందిన సోమా సత్యనారాయణ దంపతులు అన్నదానం నిర్వహించారు. సుమారు 300 మంది మాలాధారులు పాల్గొన్నారు.

'జోగి రమేష్ అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలి'

ముదినేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జోగి రమేష్ అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు కోరారు. ఆదివారం ముదినేపల్లిలో ఆయన మాట్లాడుతూ న్యాయవిచారణలో కల్తీ మద్యం కేసుతోపాటు మరిన్ని కుంభకోణాలు, అక్రమాలు బయటికి వస్తాయన్నారు. సీఎం చంద్రబాబు, నారా లోకేశ్ కుట్రపూరితంగా కేసుల్లో ఇరికించి అరెస్టు చేయించారని అతడు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.

కొండెక్కిన కూరగాయలు

ఏది కొందామన్నా రూ.80 పైమాటే



తాడేపల్లిగూడెం/ ఏలూరు టూటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొనలేం.. తినలేం.. అన్నట్లుగా కూరగాయల ధరలు రోజురోజుకి పెరుగుతున్నాయి. సామాన్యులకు ధరలు అందుబాటులో లేక విలవిల్లాడు తున్నారు. 15 రోజులుగా ఇదే పరిస్థితి. కూరగాయలు ధరలు దిగిరావడం లేదు. వారం వారానికి పెరుగుతూనే పోతున్నాయి. గత వారంతో పోల్చుకుంటే ఒక టమాటా తప్ప మిగిలిన కూరగాయల ధరలు పెరిగాయి. వాతావరణంలో వచ్చిన మార్పుతో దిగుబడి తగ్గింది. మొంథా తుఫాన్ ప్రభావంతో లంక ప్రాంతాల్లోని తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనికి తోడు కార్తీకమాసం జత కావడంతో కూరగాయల ధరలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇదే సమయంలో మార్కెట్‌కు వచ్చే కూరగాయలకు మంచి డిమాండ్ వచ్చిపడింది.

అన్నీ పైపైకే

కిలో వంకాయలు రూ.120, బెండ రూ.80, బీర కాయలు రూ.80., దొండకాయలు రూ.80, దోస కాయలు రూ.50, కాకరకాయలు రూ.60, అగాకర కాయలు రూ.120, పచ్చిమిర్చి రూ.60, క్యాప్సికం రూ.100, క్యారెట్ రూ.80, బీట్‌రూట్ రూ.80, క్యాబేజీ రూ.40 అమ్ముతున్నారు. ఇక టమాటా విషయాని కొస్తే గత వారంతో పోల్చుకుంటే కిలోకి రూ.10 తగ్గింది. గత వారం కిలో రూ.40 ఉంటే ఈ వారం రూ.30కి విక్రయించారు. కాలీఫ్లవర్ పువ్వు రూ.40, జత మునగకాడలు రూ.30, అరటికాయలు జత రూ.20కు అమ్మారు. ఉల్లి ధర మాత్రం స్థిరంగానే ఉంది. నాణ్యమైన మహారాష్ట్ర ఉల్లి పెద్ద సైజు రూ.100కు నాలుగు కిలోలు, మధ్యరకం ఉల్లి రూ.100కు 5 కిలోలు అమ్మారు. నాఫెడ్ ఉల్లి మాత్రం రూ.100కు 6 కిలోలు ఇస్తున్నారు.

ఏలూరు రైతుబజారులో ధరలిలా

ఏలూరు రైతుబజారులో వంకాయల ధరలు కిలో రూ.70 పలుకుతున్నాయి. బెండకాయలు రూ.54, కాకరకాయలు రూ.58, దొండకాయలు రూ.56, గోరుచిక్కుడు రూ.58, చిక్కుడుకాయలు రూ.120, క్యారెట్ రూ.60, దోసకాయ రూ.30, ఆనబకాయలు రూ.35, పొట్లకాయ రూ.25లకు చేరుకున్నాయి. మరోపక్క ఆకుకూర ధరలు రూ.కొత్తమీర కట్ట రూ.35, మిగిలిన ఆకుకూరలు కట్ట 15కు చేరుకున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఇవే కూరగాయలు రూ.10 నుంచి 20 అదనంగా అమ్ముతున్నారు.



దివ్యాంగులకు మూడు చక్రాల సైకిల్ అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

దాతృత్వానికి మారు పేరు పశ్చిమ

కలెక్టర్ నాగరాణి

తణుకు, నవంబరు9(ఆంధ్రజ్యోతి): పశ్చిగోదావరి జిల్లా అంటేనే దాతృత్వానికి మారుపేరు అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివారం డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కమ్మ కల్యాణమండపంలో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కిరణ్ ఫౌండేషన్ చైర్మన్ సతీష్ బొల్లా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ కిరణ్ ఫౌండేషన్ చెర్మన్ సతీష్ బొల్లా తన స్నేహితుడి పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి దివ్యాంగులకు వెన్నంటి ఉంటూ వారి అవసరాలను తీర్చుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు సేవ చేయాలనే లక్ష్యంతో వారికి కృత్రిమ అవయవాలు అందించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సహకారంతో దివ్యాంగులకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసీ మాట్లాడుతూ దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఏర్పాటు చేసిన సంకల్పం-2025 కార్యక్రమం ద్వారా ఎంతో అద్భుతమైన అనుభూతిని పొందగలిగానని తెలిపారు. తణుకు ప్రాంతంలో దాతృత్వం కలిగిన దాతలు ఉన్నారంటే గర్వకారణంగా ఉందన్నారు. భవిష్యత్ తరాలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం అన్నారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ న్యూజిలాండ్ నుంచి వీడియో సందేశాన్ని పంపారు. అనంతరం 100 మందికి కృత్రిమ అవయవాలను అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారాలకు ఉమ్మడి జిల్లాలో ఆరుగురి ఎంపిక

ఏలూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న మౌలానా అబుల్‌కలాం అజాద్ 138వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అంద జేసే ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డులకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆరుగురుని ఎంపిక చేశారు. ఎంపికైన ఉత్తమ టీచర్ల జాబితాను మైనార్టీస్ సంక్షేమశాఖ విడుదల చేసింది. ఏలూరు జిల్లానుంచి ఏలూరులోని మౌలానా అబుల్‌కలాం అజాద్ (మాకా)ఉర్దూ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్‌స్టడీస్ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న షేక్ షకీలాబేగం ఎంపికయ్యారు. జంగారెడ్డిగూడెంలో ఎస్జీటీగా 2023-24 విద్యాసంవత్సరంలో పనిచేస్తున్న సమయంలో ఏడేళ్లుగా మూతపడిన ఓ ఉర్దూ స్కూలును పునఃప్రారంభింప జేయించడంతో పాటు, అదే పాఠశాలకు డిప్యూటేషన్ వేయించుకుని ఏకంగా 40 మంది బాలబాలికలను స్కూలులో చేర్పించడంలో విజయం సాధించడంతో ప్రశంసలందుకున్నారు.. ఈమెతో పాటు జిల్లానుంచి అవార్డులు పొందిన వారిలో ఉంగుటూరు మండలం చేబ్రోలు ఉర్దూ ప్రాథ మికోన్నత పాఠశాలలో ఎస్జీటీలుగా పనిచేస్తున్న తస్లీం సుల్తానా, ఎండి సనావుల్లా షరీఫ్, కైకలూరు మండలం కొత్తపేట ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న హసీనా సుల్తానా, ఏలూరురూరల్ మండలం శనివారపుపేట ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఎస్కే .అన్వర్ జహాన్‌లకు రాష్ట్ర ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. పశ్చిమగోదావరి జిల్లానుంచి తాడేపల్లిగూడెం సంజీవరెడ్డినగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఎండి.సిరాజ్ ఎంపికయ్యారు. వీరందరికీ అవార్డులను ఈ నెల 11న విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకల్లో సీఎం అందించనున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పగులకొట్టి కాపర్ వైరు చోరీ

ద్వారకాతిరుమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంటపొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌లను పగలకొట్టి చేసి కాపర్ వైర్లను దోచుకెళ్లడం ద్వారకా తిరుమల మండలంలో ఇటీవల ఎక్కువయ్యాయి. ఆదివారం మండలంలోని రామన్నగూడెం పంచాయతీ పరిధిలో ఇటువంటి దొంగతనం వెలుగు చూడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.రామన్న గూడెం పంచాయతీ పరిధిలో ఇద్దరు రైతులకు చెందిన పొలంలో శనివారం అర్ధరాత్రి కొందరు ట్రాన్స్‌పార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌వైరు తస్క రించారు.రైతులు సయ్యద్ బడే సాహెబ్, కొడవగంటి ఆనందరావులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.





విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గోకరాజు గంగరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని, క్షత్రియ సంక్షేమ పరిషత్ సభ్యులు



వడాలిలో జ్యోతి ప్రజ్వలన చేసి గౌడ సంక్షేమ సంఘ కార్తీక సమారాధనను ప్రారంభిస్తున్న ఎంపీ పాకా సత్యనారాయణ.. భోజనాలు చేస్తున్న సంఘ సభ్యులు

ఉత్సాహంగా కార్తీక వనసమారాధనలు

క్షత్రియులు పంచభూతాలను గౌరవించాలి : గంగరాజు

కైకలూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచభూతాలను గౌరవించి హిందూమత సంస్కృతి సంప్రదాయాలను ఇనుమడింపచేయడంలో క్షత్రియులు ముఖ్యపాత్ర పోషించాలని రాష్ట్ర విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు అన్నారు. ఆదివారం కైకలూరు మండలం వదర్లపాడు బ్రాంచి వద్ద కైకలూరు క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టుకు గొట్టుముక్కల శ్యాంప్రసాద్‌రాజు, కల్యాణి దంపతులు పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ హిందూ సమాజ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని మతమార్పిడులకు క్షత్రియులెవ్వరూ వెళ్లవద్దని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ క్షత్రియులంటే సమాజాన్ని రక్షించేవాళ్ళుగా గుర్తింపు ఉంటుందని సమాజ హితం కోరడంలో ముందుండాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్ చేతుల మీదుగా క్షత్రియ సంక్షేమ సంఘం అందజేసింది. కార్యక్రమంలో క్షత్రియ సంఘ నాయకులు ముదునూరి సీతారామరాజు, తాడినాడ బాబు, జంపన రాము, సయ్యపురాజు కృష్ణంరాజు, ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు, నడింపల్లి మూర్తిరాజు, పెన్మెత్స త్రినాధరాజు, పేరిచర్ల రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘీయులు విద్యారంగంలో రాణించాలి : ఎంపీ పాకా

ముదినేపల్లి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో గౌడ సంఘీయులు విద్యారంగంలో రాణించాలని బీజేపీ రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ తెలిపారు. వడాలి గ్రామంలోని శ్రీసుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామి దేవస్థానంలో కైకలూరు గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారధన నిర్వహించారు. ఎంపీ సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి సమారాధనను ప్రారంభించారు. అనంతరం కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొర్రా చలమయ్య అధ్యక్షతన జరిగిన సమారాధన సభలో ఎంపీ సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో గౌరవ ప్రదమైన స్థానాన్ని కల్పించేందుకు బీసీల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గౌడ సంఘీయులు రాజకీయాలకతీతంగా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వెలివెల సత్యనారాయణ మాట్లాడుతూ గౌడ సంఘీయులు సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, రాష్ట్ర గౌడ సంఘ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, టీడీపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోసిన చెంచురామారావు, రాష్ట్ర గౌడ సంఘం నాయకులు పోసిన చెంచు రామారావు, పరసా ఏడుకొండలు, సమారాధన కమిటీ చైర్మన్ బొర్రా శేషుబాబు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు పోలగాని నాగరాజు, జోగి సురేష్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మోదుగుమూడి మదన్ మోహన్ ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు నగదు బహుమతి అందించారు.





అయ్యప్పస్వామి వారు.. పడిపూజ చేస్తున్న స్వాములు

ఆకట్టుకున్న పడిపూజ

మండవల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అయ్యవారిరుద్రవరంలో ఆంజనేయస్వామి, అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా జరిగింది. దాతలు కంచే పాండురంగరావు, రుక్మిణి దంపతులు ఆర్థిక సహకారంతో, వివేకానంద, చంటి గురుస్వాముల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప పదునెట్టంబడి, ఆంజనేయ పదమూడు మెట్ల పూజలు కన్నుల విందుగా సాగాయి. ఆ ప్రాంతమంతా అయ్యప్ప, ఆంజనేయ నామస్మరణతో మారుమోగింది. అనంతరం భక్తులు పాడిన భక్తి సంకీర్తనలు అలరించాయి.

శ్యామలాంబ సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు

కైకలూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాస మహోత్సవాల సందర్భంగా శ్యామలాంబ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారి ఆలయంలో కైకలూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను జరిపారు. వందలాదిమంది మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి ఈ కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశ్యామలాంబ అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో వున్న పార్వతీ సమేత రామలింగేశ్వర, రామేశ్వర, కనకలింగేశ్వర స్వామివార్లకు విశేష అభిషేకాలను నిర్వహించారు. బ్రాహ్మణ సంఘం, ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎన్‌కే శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



ధాన్యం కొనుగోలు కేంద్రాల జాబితాను వివరిస్తున్న సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

కలిదిండి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు, వెంకటాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ శివరామమూర్తి అన్నారు. ఆదివారం భాస్కరావుపేటలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భాస్కరావుపేట లాగిన్‌లో ఈ క్రాప్ నమోదు చేయడంతో ధాన్యం కొనుగోలు కేంద్రం మంజూర యిందని గ్రామంలో వరి పంట లేదని మొత్తం ఆక్వా సాగు చేస్తున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ ఆదేశాల మేరకు వరి సాగు ఉన్న వెంకటాపురం, కోరుకొల్లు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏవో విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో పుట్ట వద్ద భక్తులు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు

ముదినేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు పుట్టలో పాలుపోసి సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పాలు పొంగళ్లతో తమ మొక్కులను తీర్చుకున్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, రుద్రపాక బాల గంగాధర తిలక్ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం జరిపారు

చెక్కపల్లి జడ్పీ హైస్కూల్‌కు రక్షణ కరువు!



చెక్కపల్లి పాఠశాలలో కూలిన ప్రహరీ

- ప్రహరీ లేక పాఠశాలలోకి విష సర్పాలు..
- తల్లిదండ్రులు భయాందోళన

ముసునూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ పలుచోట్ల కూలిపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైయింది. గతేడాది కురిన భారీ వర్షాలకు నాలుగు చోట్ల ప్రహరీ కూలింది. ఇక్కడ 303 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల చుట్టూ ముళ్ళ పొదలు, పక్కనే పొలాలు ఉండటంతో పాఠశాలలోకి విష పురుగులు వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అకతాయిలు రాత్రుళ్ల అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడుతున్నారు. ప్రహరీ కూలిపోయి రెండేళ్ల కావొస్తున్న నేటికీ పట్టించుకునే నాథుడే లేడని తల్లి దండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రహరీని నిర్మించాలని కోరుతున్నారు. దీనిపై పాఠశాల హెచ్ఎం అల్లాబక్షను వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదికను అందించి, త్వరలో సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చనుబండలో ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్

217 మందికి ఉచిత వైద్య చికిత్సలు

చాట్రాయి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చనుబండ కోదండరామ స్వామి ఆలయం ఆవరణలో ఆదివారం శ్రీవైష్ణవి హాస్పటల్ (తిరువూరు) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 217 మందికి చికిత్సలు చేశారు. డాక్టర్ భానుతేజ (ఆర్థో అండ్ రోమాటలజీ), డాక్టర్ అజీమీర్(జనరల్ ఎండీ), డాక్టర్ భరత్(ఫ్యామిలీ ఫిజిషియన్), రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఆలయ ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి, వేగా జ్యూయలరీస్ అధినేత వనమా కేశవరావు, బీజేపీ నాయకుడు నెక్కలపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నంపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

చిన్నంపేట సచివాలయంలో ప్రీతమ్ ఐ హాస్పటల్ (చింతలపూడి) ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. జిల్లా టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీటీఎస్ఎఫ్ జిల్లా శాఖ నూతన కార్యవర్గం

ఏలూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పేరెంట్స్, టీచర్స్ అండ్ స్టూడెంట్ ఫెడరేషన్ (పీటీఎస్ఎఫ్) జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏలూరులో జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ అసిన్, ఎం.జయలక్ష్మి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా సింగరాజు, రవితేజ, కార్యవర్గ సభ్యులుగా భారతి, స్వాతియాదవ్, లక్ష్మిలను ఎన్నుకున్నారు. తొలుత జరిగిన సంఘ సమావేశంలో పీటీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లాపు వేణు మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు దోపిడి, విద్యార్థులపై ఒత్తిళ్లు, ఆత్మహత్యలను అరికట్టేందుకు కార్యాచరణను అమలు చేస్తూనే ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతంచేసేందుకు సంఘ నాయకులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సంఘ రాష్ట్ర నాయకులు కుమార్‌బాబు, ఉదయ్‌కుమార్, సత్యనారాయణ రాజు, జంపాలరావు, షేక్ కరీమున్నీసా బేగం, కె.భీమయ్య, సురేష్‌బాబు, సంధ్యచౌదరి, పార్వతీదేవి, సీతాదేవి, సత్య, రమణకుమారి, మీనాక్షిరెడ్డి, లీలావతి పాల్గొన్నారు.

తీరనున్న దాహార్తి

(5వ పేజీ తరువాయి)

ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు నిర్మించి అక్కడి నుంచి పైప్ లైన్ల ద్వారా ఇంటింటికీ మంచినీటిని అందచేస్తారు. ఈ పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని గాడిలోకి తెచ్చారు. ప్రస్తుతం ఈ పథకం టెండరు దశలో ఉందని టెండరు పూర్తవగానే పనులు ప్రారంభిస్తామని పబ్లిక్ హెల్త్ ఈఈ కె.ఫణిభూషణ రావు తెలిపారు.

శుద్ధి చేసిన మంచినీటిని అందజేస్తాం



పట్టణంలో సుమారు పదివేల కుళాయిల ద్వారా శుద్ధి చేసిన మంచినీటిని ప్రజలకు అందచేస్తాం. ప్రస్తుతం ప్రజలకు మంచినీరు అందించడానికి బోర్లు,మోటార్లు రిపేర్లు, కొత్తవి కొనడంతో పాటు విద్యుత్ బిల్లులు చెల్లించడానికి ఏటా రూ.3కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఏఐబీ పథకం డైరెక్టు పంపింగ్ స్కీము కావడంతో విద్యుత్ బిల్లుల సమస్య ఉండదు. మున్సిపాలిటీ ఏడాదికి రెండు కోట్లు పథకం మెయింటెనెన్స్ కోసం ఖర్చు చేసినా రూ.కోటి మేర మిగిలే అవకాశాలున్నాయి.

- కెవి.రమణ, మున్సిపల్ కమిషనర్,జంగారెడ్డిగూడెం

ఒత్తిళ్లకు లొంగితే చర్యలు తప్పవు

జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్

నూజివీడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జూదాలను అరికట్టే విషయంలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు ఏమాత్రం లొంగినా పోలీస్ సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ హెచ్చరించారు. నూజివీడు నియోజకవర్గంలో జోరుగా జూదాలు నిర్వహణపై ఆయన స్పందిస్తూ నియోజకవర్గం పరిధిలోని ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బందితో ఆదివారం సెట్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నియోజకవర్గంలో ఎప్పటి కప్పుడు నిఘాను ఏర్పాటు చేసుకొని జూదాలను అరికట్టాలన్నారు. అనంతరం నూజివీడు సర్కిల్ పరిధిలో జూదాలు నియంత్రణపై నూజివీడు సీఐ రామకృష్ణ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యల పై చర్చించారు.

పేదలకు ఉచితంగా న్యాయ సహాయం

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మీపార్వతి

నూజివీడు టౌన్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ధనికులతో పాటు సమానంగా పేదవారికి సమాన న్యాయం అందాలనే ఉద్దేశంతో 1987లో లీగల్ సర్వీసెస్ యాక్ట్ అనే చట్టాన్ని రూపొందించగా 1995 నవంబరు 9 నుంచి అమల్లోకి వచ్చిందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.లక్ష్మీపార్వతి అన్నారు. న్యాయసేవ దినోత్సవం సందర్భంగా నూజివీడు సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వ హించారు. ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ ఈ చట్టం ప్రకారం బడుగు బలహీన వర్గాల వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందిస్తారన్నారు. అడ్వకేట్ ఎస్‌కేడి ప్రసాద్, వార్డెన్ ఆర్.సంధ్యారాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం : తల్లాడ



సి గుడిపాడులో వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత తల్లాడ శ్రీనివాసరావు

చాట్రాయి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో యువకులు నిత్యం క్రీడలను అభ్యసిస్తే ఆరోగ్య జీవనం సొంతమవుతుందని జిల్లా టీడీపీ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి తల్లాడ శ్రీనివాసరావు అన్నారు. నరశింహారావుపాలెం శివారు సి గుడిపాడుకు చెందిన యువకులకు వాలీబాల్ కిట్లను ఆదివారం తల్లాడ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి యువకుడు తల్లిదండ్రుల మాటలను గౌరవిస్తూ, చెడు వ్యసనాలకు లోను కాకుండా చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఉద్బోధించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నేత అత్తులూరి

ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవాలి

చాట్రాయి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులకు అమ్మి నష్టపోవద్దని జిల్లా టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు కోరారు. చిన్నంపేటలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ గ్రేడ్-1 రకం క్వింటాల్‌కి రూ.2,389, కామన్ రకం క్వింటాల్ రూ.2,369 కొనుగోలు చేసి 24 గంటల్లో రైతు ఖాతాలో సొమ్ము జమ చేస్తారన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

చంపుతానని బెదిరించిన భర్తపై కేసు

ముసునూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య అత్తను చంపుతానని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై ముసునూరు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కాట్రేనిపాడుకు చెందిన పత్తిపాటి షారోనురాజు, ఐశ్వర్యలు భార్యా భర్తలు. ఐశ్వర్య, ఆమె తల్లి సరోజిని నూజివీడులో పళ్ల వ్యాపారం చేస్తున్నారు. గతనెల 25వ తేదీన షారోనురాజు మద్యం తాగి వచ్చి భార్య, అత్తను దుర్భాషలాడి, మీ ఇద్దరిని చంపుతానని బెదిరించాడు. భయభ్రాంతులకు గురైన ఐశ్వర్య భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.